క్లుప్తంగా

రేపు సామాజిక ఉపాధి హామీ బహిరంగ సభ

తంబళ్లపల్లె: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 9 గంటలకు ఉపాధి హామీ సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కృష్ణమూర్తి, ఏపీఓ అంజనప్ప బుధవారం తెలిపారు. మండలంలో ఏప్రిల్ 2023 నుంచి మార్చి 2024 వరకు జరిగిన ఉపాధి హామీ పనులను ఎస్ఆర్‌బి సుబ్బారావు ఆధ్వర్యంలో ఏడుగురు డిఆర్‌పిలు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించారు. తనిఖీ నివేదికలు బహిరంగ సభలో వెల్లడిస్తారని తెలిపారు.

నాగదేవత పునః ప్రతిష్ట

మదనపల్లె సిటీ: స్థానిక బెంగళూరు రోడ్డులోని శ్రీ యోగభోగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం నాగదేవత పునః ప్రతిష్ట కార్యక్రమం జరిగింది. వేద పండితులు గణపతిపూజ, పుణ్యావాచనం, కళశస్థాపన పూజ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రమణ, అర్చకులు విశేశ్వర ప్రసాద్, భక్తులు పాల్గొన్నారు.

పారిశుధ్యానికి ప్రాధాన్యత

కేవీపల్లె : ప్రజారోగ్యమే లక్ష్యంగా పారిశుధ్యానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఈఓపీఆర్‌డీ ఎస్.ఎ. గఫూర్ అన్నారు. బుధవారం మండలంలోని నూతనకాల్వ పంచాయతీలో విస్తృతంగా పారిశుధ్య పనులు చేపట్టారు. చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యర్థపదార్థాలు, చెత్తాచెదారం పంచాయతీ చెత్తసేకరణ బండిలో వేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పంచరత్న, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రయాణికుల సంక్షేమమే ఆర్టీసీ ధ్యేయం

పీలేరు రూరల్ :
ప్రయాణికుల సంక్షేమమే ఆర్టీసీ ధ్యేయమని డీఎం కుమార్ అన్నారు. బుధవారం ఆర్టీసీ బస్టాండ్‌లో డిపోకు కొత్తగా వచ్చిన మూడు బస్సు సర్వీసులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీలేరు – తిరుపతి ఎక్స్‌ప్రెస్ సర్వీసు, పీలేరు – సుండుపల్లె పల్లెవెలుగు, పీలేరు – తిరుపతి పల్లెవెలుగు కొత్త సర్వీసులు ప్రారంభించినట్లు తెలిపారు. త్వరలో మరో మూడు ఎక్స్‌ప్రెస్‌లు, నాలుగు పల్లెవెలుగు సర్వీసులు రానున్నట్లు తెలిపారు. ప్రయాణికులకు మెరుగైన సేవలందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో బస్‌స్టేషన్ మేనేజర్ బాబునాయక్, ఏఈడీసీ హనీఫ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాయల పట్టాభిషేక దినోత్సవం

వాల్మీకిపురం: స్థానిక బలిజసేన ఆధ్వర్యంలో బుధవారం కృష్ణదేవరాయల పట్టాభిషేక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆంధ్ర భోజలు మహారాజు పట్టాభిషేకం గావించి 515 సంవత్సరాలు పూర్తి చేసుకున్న శుభ సందర్భంగా బుధవారం రాయల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బలిజసేన రాష్ట్ర కార్యదర్శి రామచంద్ర, పీలేరు ఇంచార్జి వలిగిరి శంకర, శ్రీపతి, నాయకులు బాటసారి శ్రీనివాసులు, గణేష్, వంశీకృష్ణ, నారాయణ, నాగరాజ, మధు, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

భవిత కేంద్రాల్లో మెరుగైన సేవలు అందించాలి

– సహిత విద్య జిల్లా కోఆర్డినేటర్ జనార్ధన్

మదనపల్లె సిటీ: భవిత కేంద్రాల్లో ప్రత్యేక అవసరాల పిల్లలకు మెరుగైన సేవలు అందించాలని సహిత విద్య జిల్లా కో ఆర్డినేటర్ జనార్ధన్ అన్నారు. బుధవారం ఆయన మదనపల్లెలోని భవిత కేంద్రాన్ని తనిఖీ చేశారు. రికార్డులు, పరిశీలించి సహిత విద్య ఉపాధ్యాయులకు సూచనలు,సలహాలు ఇచ్చారు. ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించి వారిని కేంద్రంకు వచ్చేలా చూడాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న అలవెన్సులు, ఉపకరణాలు గురించి తెలియజేశారు. ప్రత్యేక అవసరాల పిల్లల్లోని నైపుణ్యాలు, సామర్థ్యాలను వారి తల్లిదండ్రులలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సహిత విద్య ఉపాధ్యాయులు నాగేంద్ర, రెడ్డమ్మ తదతరులు పాల్గొన్నారు.

కలికిరి తహసీల్దారు బాధ్యతల స్వీకరణ

కలికిరి: కలికిరి: తహసీల్దారుగా ఎస్ మహేశ్వరి భాయి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల విధులలో భాగంగా అనంతపురం జిల్లా నుంచి కలికిరి తహసీల్దారుగా ఉన్న పి.విజయకుమారి ఇటీవల బదిలీపై సొంత జిల్లాకు వెళ్లారు. ఆ స్థానంలో ఇటీవల నియమితులైన మహేశ్వరిభాయి విధులలో చేరారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆమెను కలిశారు. అనంతరం ఆమె వారితో మాట్లాడుతూ వీఆర్‌ఓలు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారంలో చొరవ చూపాలని కోరారు.

గుర్రంకొండ తహసీల్దార్..

గుర్రంకొండ: మండల తహసీల్దార్‌గా సి.శ్రీనివాసులు ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేస్తున్న శ్రీధర్ ఎన్నివిధుల అనంతరం కర్నూలుకు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో సి.శ్రీనివాసులు బుధవారం ఇక్కడ బాధ్యతలు చేపట్టారు.

పెద్దతిప్పసముద్రం తహసీల్దార్..

పెద్దతిప్పసముద్రం: మండల తహసీల్దార్‌గా శ్రీరాములు నాయక్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో కేవీబీపురం మండలంలో పని చేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు.



రేషన్ దుకాణాల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేసి పేదలకు ఇంటి వద్దకే నిత్యావసరాలు అందించాలని అప్పట్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నూతన విధానానికి శ్రీకారం చుట్టింది. ఇంటింటికీ రేషన్ అందించడం కోసం ఎండీయూ వాహనాలను ఏర్పాటు చేశారు. అలాగే నిరుద్యోగులైన వారికి ఈ వాహనాల ద్వారా ఉపాధి కల్పించారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం ఈవిధానాన్ని ఎత్తివేసి మళ్లీ పాత విధానంలో రేషన్ దుకాణాల ద్వారా అక్రమాలకు రూట్ వేస్తోంది. ఇటీవల సీఎం చంద్రబాబు నాయుడు ఎండీయూ వాహనాలను తొలగిస్తామని చెప్పడంతో రేషన్ లబ్ధిదారులతో పాటు వాహన డ్రైవర్లు ఆందోళన చెందుతున్నారు.

దూరం..భారం ఉండేది కాదు



మినీ ట్రక్కులు రాక మునుపు రేషన్‌షాపు వద్దకు వెళ్లి కార్డుదారులు పడిగాపులు కాయాల్సి వచ్చేది. ఒక రోజంతా కూలి పనులు, పనిపాటలు ఆపాల్సి వచ్చేది. క్యూలో నిలబడి సరుకులు తెచ్చుకోవాల్సి వచ్చేది. జగన్ మినీ ట్రక్కుల ద్వారా నేరుగా ఊరిలోనే ప్రతి బజార్లో సరుకులు ఇచ్చేవారు. దూరం వెళ్లాల్సిన పని తప్పింది. తీసుకున్న సరుకులు మోసే భారం కూడా ఉండేది కాదు. వ్యయప్రయాసలు ఉండేవి కావు. రేషన్ సరుకులు అంటే మినీ ట్రక్కులు గుర్తుకు వచ్చేవి. ఇలాంటి ట్రక్కులకు ప్రస్తుత కూటమి ప్రభుత్వం స్వస్తిపలకాలని నిర్ణయం తీసుకోవడం బాధాకరం -సత్యం, ఉప సర్పంచ్, నందిరెడ్డిగారిపల్లె, కురబలకోట

ముసలోళ్ళు బియ్యం తెచ్చుకునేది ఎట్లా



నాది పెద్దతిప్పసముద్రం మండలం సొన్నువారిపల్లి గ్రామం. మా ఊళ్లో రేషన్ దుకాణం లేదు. మూడు కిలోమీటర్ల దూరంలో చల్లావాండ్లపల్లిలో ఉంది. జగన్ గవర్నమెంటులో స్టోర్‌కి పోయే పని లేకుండా బియ్యం బండి ఏర్పాటు చేశారు. కాలు కదపకుండా ఈ ఐదేళ్ళు బియ్యం తీసుకున్నాం. ఇప్పుడు బియ్యం బండి రాకుంటే మాలాంటి ముసలోళ్ళ పరిస్థితి ఏమిటి?. బియ్యం బండ్లు యథావిధిగా నడపాలి.
-వలిపి వెంకట్రమణ, పెద్దతిప్పసముద్రం

బస్సు సౌకర్యం కూడా లేదు



పెద్దతిప్పసముద్రం మండలం బూర్లపల్లి పంచాయతీ సొన్నువారిపల్లి గ్రామం. స్టోర్ బియ్యం తెచ్చుకోవాలంటే రాను పోనూ ఆరు కిలోమీటర్ల దూరంలో ఉండే చల్లావాండ్లపల్లికి ప్రయాణం చేయాలి. మా ఊరికి తారు రోడ్డు ఉన్నా ఎలాంటి బస్సు, ఆటోల సౌకర్యాలు లేవు. గత ప్రభుత్వంలో బియ్యం బండి ఇంటి వద్దకే వచ్చేది. సంతోషంగా సరుకులు తీసుకునే వాళ్ళం. ఇప్పుడు మళ్లీ స్టోర్‌లకు పోవాలంటే దినసరి కూలి పనులు వదిలి వెళ్లాలి. ప్రభుత్వం కూడా మాలాంటి కూలీల అవసరాలు గుర్తించాలి. -గోగుల అంజమ్మ, పెద్దతిప్పసముద్రం

మా కొడపు కొడతారా?



జగన్ ప్రభుత్వం మినీ ట్రక్కులను నిరుద్యోగులకు ఇవ్వడం వల్ల ఉపాధి లభించేది. మండలంలో ఎనిమిది మినీ ట్రక్కులు ఉన్నాయి. 13,050 రేషన్ కార్డులకు ప్రతి నెలా నిత్యావసర సరుకులు పంపిణీ జరిగేది. బ్యాంకు రుణాలతో పాటు సబ్సిడీని ఇచ్చి ట్రక్కు ఓనర్‌ను చేసింది. గుర్తింపు గౌరవం ఉండేది. ప్రతి నెలా రూ.18 వేలు వేతనం వచ్చేది. సేవా భావమన్న తృప్తి కలిగించేది. ఇప్పుడు మా కడుపు కొడితే ఎలా బతకాలి.
-కె. హరుణ్ బాషా, ఎండీయూ ఆపరేటర్, అంగళ్లు

పాఠ్యాంశాలను ప్రణాళికబద్ధంగా బోధించాలి

– జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్



గుర్రంకొండ తెలుగు జెడ్పీహైస్కూల్లో రికార్డులు తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్

గుర్రంకొండ: విద్యార్థులకు పాఠ్యంశాలను ప్రణాళికబద్ధంగా బోధించాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ అన్నారు. బుధవారం స్థానిక తెలుగు జెడ్పీ హైస్కూల్లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఈసందర్భంగా ఉపాధ్యాయుల హాజరు రిజిష్టర్, హైస్కూల్ రికార్డులు, మధ్యాహ్న భోజన రిజిష్టర్లు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు తప్పనిసరిగా డ్రెస్‌కోడ్ పాటించాలన్నారు. ఉపాధ్యాయులు తమ బాధ్యత గుర్తెరిగి హుందాగా, ఆదర్శంగా ఉండాలన్నారు. ప్రతిరోజు తాము ఏ పాఠ్యాంశాన్ని బోధించాల్సి ఉంటుందో ముందుగా ప్రణాళికలు సిద్ధం చేసుకొని తరగతిలోకి అడగుపెట్టాలన్నారు. ప్రణాళిక పరంగానే విద్యార్థులకు పాఠాలు చెప్పాలన్నారు. అలాగే ప్రతిరోజు మధ్యాహ్న భోజనాన్ని ఉపాధ్యాయులు తనిఖీ చేయాలన్నారు. కనీసం ప్రతిరోజు ఇద్దరు ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజనం రుచి చూసి రిజిష్టర్‌లో లోటుపాట్లు పొందుపరచాలన్నారు. భోజనం నాణ్యతపై నిర్లక్ష్యం తగదన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు సురేంద్రబాబు, సుబ్రమణ్యం, హెడ్మాస్టర్ అహ్మద్‌బాషా, పీడీ రమేష్, ఉపాధ్యాయులు హర్షవర్ధన్‌రెడ్డి, జావీద్, త్రినాథ్‌రావ్ పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు

– మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్



నిమ్మనపల్లి పీహెచ్‌సీలో రికార్డుల గదిని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్

నిమ్మనపల్లె : ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ అన్నారు. బుధవారం నిమ్మనపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఆస్పత్రి నిర్వహణ, రోగుల వివరాలు, మందుల స్టాకు, ఆస్పత్రి నిర్వహణ రికార్డులు,ల్యాబ్, రోగుల పడకగదులను పరిశీలించారు. సిబ్బంది డ్యూటీలవివరాలను డాక్టర్ ప్రత్యూష ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య ఆరోగ్య సిబ్బంది తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలని ఆదేశించారు. ఆసుపత్రికి వచ్చే రోగుల వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో విధులలో రోగులు అత్యవసర సేవల నిమిత్తం ఆసుపత్రికి వస్తారని,స్టాఫ్ నర్సులు, ఇతర సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అన్నారు. 108 వాహనాన్ని 24 గంటలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. వర్షాకాలం కావడంతో దోమల ప్రబలకుండా గ్రామాలలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఆసుపత్రి ఆవరణంలో సీసీ కెమెరాలు నిత్యం పనిచేస్తుండాలన్నారు. ఆసుపత్రిలో సెక్యూరిటీ గార్డ్ ను నియమించాల్సిందిగా డాక్టర్ ప్రత్యూష సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ఫ్రీ హోల్డ్ భూముల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ధనంజయులు, డాక్టర్ ప్రత్యూష, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పశుగణన పారదర్శకంగా చేపట్టాలి

పీలేరు రూరల్ : పశుగణన పారదర్శకంగా చేపట్టాలని జిల్లా పశు సంవర్థక శాఖ అధికారి డాక్టర్ గుణశేఖర్‌పిళ్లై అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పీలేరు నియోజకవర్గంలోని ఎన్విరాన్ మెంటర్లు, సూపర్ వైజర్లకు 21వ అఖిల భారత పశుగణన 2024 కార్యక్రమంపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఐదేళ్లకోసారి జరిగే పశుగణన ఆధారంగానే గ్రామాల్లోని రైతు పేరుతోపాటు పశువుల, ఆవులు, గొర్రెలు, బర్రెలు, పెంపుడు కుక్కలు, మేకలు మొదల పశు జాతులను నమోదు చేయాలన్నారు. వచ్చే నెల 1 నుంచి డిసెంబర్ 31వ తేదీ లోపు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో పశు సంవర్ధకశాఖ డీడీ డాక్టర్ మాలకొండయ్య, ఏడీఏలు డాక్టర్ లోకేష్, డాక్టర్ విశ్వేశ్వర్, డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, డాక్టర్ వెంకటమునినాయుడు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌ల వద్ద మధ్యవర్తులపై ప్రత్యేక నిఘా

– డీఎస్పీ డి.కొండయ్యనాయుడు

మదనపల్లె : ప్రజా, కులసంఘాల నాయకులు, రాజకీయపార్టీల నాయకులు పోలీస్‌స్టేషన్‌ల చుట్టూ తిరుగుతూ, బాధితులను పోలీసుల వద్దకు వెళ్లనివ్వకుండా తాము న్యాయం చేస్తామని మధ్యవర్తులుగా ఏర్పడి పంచాయతీలు చేస్తున్న వ్యక్తులపై ప్రత్యేక నిఘా పెట్టి వారందరిపై కఠినచర్యలు తీసుకుంటామని డీఎస్పీ డి.కొండయ్యనాయుడు అన్నారు. బుధవారం డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటుచే సిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో భాగంగా ఆటోలు, మైనర్ రైడింగ్, హైస్పీడ్, సైలెన్సర్ తొలగింపు, బైక్ రేసుల పైన ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు. అదేవిధంగా సబ్ కలెక్టరేట్‌లో జరిగిన ఫైళ్ల దగ్ధం ఘటనకు సంబంధించి చాలా మంది భూబాధితులు కార్యాలయం వద్దకు వస్తున్నారని, వారికి న్యాయం చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. కబ్జాలు చేసిన వారిపై కఠినచర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేస్తామన్నారు. పోలీస్‌స్టేషన్‌ల వద్ద మీడియా ముసుగులో పేదల నుంచి డబ్బులు దండుకున్నట్లు తెలిసిందని, మీడియా సమాచారం కోసం స్టేషన్‌లో పీఆర్వోను ఏర్పాటుచేస్తున్నామన్నారు. పట్టణంలో గంజాయి వినియోగాన్ని అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటుచేస్తున్నామన్నారు. విద్యాసంస్థల పరిసర ప్రాంతాల్లో సిగరెట్లు, పొగాకు ఉత్పత్తులు అమ్మకుండా చర్యలు తీసుకుంటామన్నారు. పట్టణంలో ఫ్రెండ్లీ పోలీసింగ్ అమల్లో ఉందని, పోలీస్‌స్టేషన్‌లకు ప్రజలు నేరుగా వచ్చి తమ సమస్యలు నిర్భయంగా చెప్పుకోవచ్చని, మధ్యవర్తుల అవసరం లేదన్నారు.

చేనేత పరిశ్రమను ఆదరించాలి

మదనపల్లె సిటీ: ప్రతి ఒక్కరూ చేనేత పరిశ్రమను ఆదరించాలని ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణవేణి అన్నారు.బుధవారం స్థానిక కాలేజీలో జాతీయ చేనేత దినోత్సవం పురస్కరించుకుని భారతీయ చేనేత వస్త్రాలు–సంస్కృతి, వారసత్వం–అల్లికల అనే అంశంపై వ్యాస,వక్తృత్వ పోటీలు నిర్వహించారు. వివిధ రాష్ట్రాల చేనేత చీరలను ధరించి విద్యార్థినులు ఫ్యాషన్ షో నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ భారతీయ చేనేత వస్త్రాలు భారతీయ సంపదన్నారు. అధ్యాపకులు చేనేత వస్త్రాలు ధరించి వాటి ప్రాముఖ్యతను విశిష్టతను తెలియజేశారు.

సమగ్ర యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

– జిల్లా వ్యవసాయాధికారి బి. చంద్రానాయక్



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్

కేవీపల్లె : పంటల సాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చునని జిల్లా వ్యవసాయాధికారి బి. చంద్రానాయక్ అన్నారు. బుధవారం మండలంలోని గ్యారంపల్లె రైతు సేవా కేంద్రం పరిధిలో రైతు లక్ష్మయ్య పొలంలో పొలంబడిలో సాగు చేసిన వేరుశెనగ పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలకు రసాయనిక ఎరువులు, పురుగు మందులకు స్వస్తి పలికి సేంద్రియ ఎరువులు వాడాలన్నారు. సహజసిద్ధమైన ఎరువులతో నాణ్యమైన అధిక దిగుబడి పొందవచ్చునని తెలిపారు. పొలంబడిన పంటను ఫార్మర్స్ ప్రొడ్యూస్ గ్రూప్ (ఎఫ్‌పీవో) ద్వారా అమ్మించడం జరుగుతుందన్నారు. పొలంబడిలోని రైతులందరికీ ఎఫ్‌పీవో ద్వారా సర్టిఫికెట్ ఇవ్వనున్నట్లు తెలిపారు. తద్వారా రైతులు పంటలను మంచి ధరలకు అమ్మవచ్చునని చెప్పారు. వ్యవసాయాధికారులు కౌలు రైతులను గుర్తించి వ్యవసాయ లోన్లు ఇప్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ వై.వి. రమణరావు, ఏవోలు శ్రావణి, రమాదేవి, వ్యవసాయ విస్తరణాధికారులు అనితాదేవి, ఇంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్‌బ్యాంకు సేవలు ప్రశంసనీయం

మదనపల్లె సిటీ: ఫుడ్‌బ్యాంకు ద్వారా నిరుపేదలకు చేస్తున్న సేవలు ప్రశంసనీయమని వన్‌టౌన్ సీఐ చాంద్‌బాషా అన్నారు. బుధవారం స్థానిక ఆర్టీసీ బస్టాండులో హెల్పింగ్‌మైండ్స్ ఆధ్వర్యంలో నడుస్తున్న ఫుడ్‌బ్యాంకును పరిశీలించారు. అందులో ఫుడ్‌ప్యాకెట్లు అందుబాటులో ఉంచి పలువురికి అన్నం పొట్లాలను అందజేశారు. సీఐ మాట్లాడుతూ ఇలాంటి సేవ కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో హెల్పింగ్‌మైండ్స్ వ్యవస్థాపకులు అబూబకర్‌సిద్దిక్, ఎస్ఎస్‌పి పూర్వపు కోఆర్డినేటర్ మహమ్మద్‌ఖాన్, సభ్యులు కిరణ్, పురుషోత్తం, చరణ్ పాల్గొన్నారు.

జీతాలు చెల్లించాలని పంచాయతీ కార్మికుల ధర్నా

పీలేరు : తమకు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ గ్రామ పంచాయతీ కార్మికులు బుధవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని, పిల్లలకు పాల ప్యాకెట్లు కూడా కొనలేని దుర్భర జీవితాలు గడుపుతున్నట్లు తెలిపారు. గతంలో జీతాలు సంక్రమంగా చెల్లించేవారని, గత పది నెలలుగా జీతాలు సక్రమంగా ఇవ్వకుండా మానసిక వేదనకు గురి చేస్తున్నారని వాపోయారు. ఇప్పటికైనా స్పందించి జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు వెంకటరామయ్య, బి.వి. రమణ, పులి రెడ్డెప్ప, ఓబులేషు, మస్తాన్, చిట్టెమ్మ, రాధారాణి తదితరులు పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

– సీఐ పులిశేఖర్



అవగాహన కల్పిస్తున్న సీఐ పులిశేఖర్

వాల్మీకిపురం: విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని వాల్మీకిపురం సీఐ పులిశేఖర్ అన్నారు. బుధవారం స్థానిక పివిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రహరీ క్లబ్‌ని ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం దుష్పరిణామాలు, పొగాకు ఉత్పత్తుల వినియోగం వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. విద్యార్థులు చదువుకు దగ్గరగా, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, తద్వారా ఉన్నత విలువలు అలవడుతాయన్నారు. విద్యార్థులకు ఎటువంటి సమస్యలు ఉన్నా పోలీస్ కంట్రోల్ నెంబర్ 100, చైల్డ్ లైన్ నెంబర్ 1098కు డయల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై నాగేశ్వర రావు, ఎంఈవో వెంకటరత్నం, హెచ్ఎం సావిత్రి, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, రమణప్ప, నాగేశ్వర, నాగరాజ, వసుమతి, కల్పలత, సుజాత, శేఖర్‌రెడ్డి, రవీంద్రరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్రం దృష్టికి నేతన్నల సమస్యలు

–బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్



చేనేత కార్మికులను సత్కరించిన బీజేపీ నాయకులు

బి.కొత్తకోట: చేనేతల సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్ అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక నందిశెట్టివీధిలో నిర్వహించన సభలో నేతన్నలు మాట్లాడుతూ గతంలో తమకు అందించిన పింఛన్ల, ఉచిత వైద్యం పథకాలు అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మరమగ్గాలతో ఉనికి కోల్పోవాల్సిన పరిస్థితి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై సాయిలోకేష్ స్పందిస్తూ ఈ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం చేనేత కార్మికులకు శాలువలతో సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు గోపాల్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి ఎస్.శోభారాణీ, మండల అధ్యక్షులు రాందాస్, చేనేత విభాగం నియోజకవర్గ అధ్యక్షులు లక్ష్మయ్య, కోకన్వీనర్ శంకర్‌రెడ్డి, సీనియర్ నాయకులు గోరంట్ల రమేష్, శీలం రంగారెడ్డి, గోపి, మురళీ పాల్గొన్నారు.

కన్యాకపరమేశ్వరికి ప్రత్యేక పూజలు

రామసముద్రం: రామసముద్రం బజారువీధిలో వెలసిన శ్రీకన్యాకపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో బుధవారం రామకోటి ఉత్సవాలు ముగిశాయి. 51వ శ్రీరామకోటి సప్తః మహోత్సవాలు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గ్రామ పురవీధుల్లో శ్రీరామచంద్రుల చిత్రపటాన్ని ఘనంగా ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించారు. భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

మందకృష్ణ స్వాగత ర్యాలీని జయప్రదం చేయండి



మాట్లాడుతున్న చిలుమూరు శ్రీనివాసరావు

మదనపల్లె : ఎస్సీ వర్గీకరణ పోరాటంలో 30 ఏళ్ల అలుపెరగకుండా ఎన్నో ఆటంకాలు, అవరోధాలను తొలగించుకుని, సుప్రీంకోర్టు తీర్పుతో విజయాన్ని సాధించి ఆగస్ట్ 13న హైదరాబాద్‌కు వస్తున్న ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ స్వాగత ర్యాలీని జయప్రదం చేయాలని మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు ప్రొఫెసర్. డాక్టర్.చిలుమూరు శ్రీనివాసరావు మాదిగ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ప్రెస్ క్లబ్ లో జరిగిన ఎంఈఎఫ్ మదనపల్లి ప్రాంత ఎంఈఎఫ్ ముఖ్య ప్రతినిధుల సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ పై సుప్రీం కోర్ట్ ఇచ్చిన తీర్పు సామాజిక ఉద్యమాల చరిత్ర లో ఒక నూతన అధ్యాయాన్ని లిఖించిందన్నారు. ఎస్సీ వర్గీకరణ సాధించేందుకు అన్ని రకాలుగా అండగా నిలబడ్డ ప్రధానమంత్రి మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబులకు మాదిగ జాతి పక్షాన ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ జాతీయ నాయకులు నరేంద్రబాబుమాదిగ, ఎంఈఎఫ్ జాతీయ కార్యదర్శి ఓ.వి.రమణ, గంపలశ్రీను, గంగాధర్, పార్థసారధి, విజయ్‌భాస్కర్, రవి, అల్లురయ్య, శీను, సూరి, మనోహర్, కొండిపల్లెవేణు, శ్రీరాములు, ఆటోశీను, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతి

వాల్మీకిపురం: విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతి వేడుకలను జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం స్థానిక పీవీసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రవీంద్రనాథ్ ఠాగూర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. . కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఉమా అమరేశ్వరి, అధ్యాపకులు భాస్కర్, ప్రసాద్, రాజగోపాల్ రెడ్డి, ప్రేమలత, కళావతి, లక్ష్మీదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

విశ్వకవి రవీంద్రునికి నివాళులు

మదనపల్లె సిటీ: విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక మదనపల్లె రచయితల కార్యాలయంలో బుధవారం ఘనంగా నివాళులు అర్పించారు. మరసం కార్యదర్శి లింగాల యుగంధరాచారి మాట్లాడుతూ విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ బీటీ కాలేజీలో బసచేశారని గుర్తు చేశారు. ఇక్కడే జాతీయగీతం జనగణమణ గీతాన్ని ఆంగ్లంలోకి తర్జుమా చేశారన్నారు. ఆయన మదనపల్లెకు గుర్తింపు తీసుకువచ్చారన్నారు. కార్యక్రమంలో రచయితలు నాగరాజు, నాగభూషణరావు, రామమోహన్‌నాయుడు,దదివాకర్ పాల్గొన్నారు.

విశ్వకవికి నివాళి

బి.కొత్తకోట: మండలంలోని తుమ్మనంగుట్ట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతి నిర్వహించారు. ఠాగూర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఈవో రెడ్డిశేఖర్ మాట్లాడుతూ రవీంద్రుడు రచించిన గీతాంజలి ఆయనకు ప్రపంచవ్యాప్త ఖ్యాతిని తెచ్చిపెట్టిందన్నారు. అందులోని గీతం మహ్మాతాగాంధీకి ఎంతో ఇష్టమని అన్నారు. హెచ్ఎం అరుణాదేవి, సీఆర్‌పీ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.